# మా ఇంటిదొంగలు

ఆటో ఇంటిముందు ఆగంగానే మా ఆవిడ బ్రీఫ్ కేస్‌తో ముందు దిగి, తాళం తీయడానికి గుమ్మం వేపు కదిలింది.

నేను ఆటో దిగకుండానే పదిరూపాయల కాగితాన్ని ఆటో డ్రయివర్‌కి ఇచ్చాను. చిల్లర తీసుకుని దిగవచ్చని నా అభిప్రాయం.

"సరిపోయిందండి...." మీటర్ని తిప్పేసి, తిరిగి ఆటోని స్టార్ట్ చేస్తూ అన్నాడతను.

"ఎనిమిది రూపాయలేగా అయింది!" నా ఆశ్చర్యం అతనికి చిర్రెత్తించినట్లుంది.

"ఇక్కడికి మీటర్ ఛార్జ్‌కి ఎవరొస్తారండీ....ఎక్స్‌ట్రా ఇవ్వాలి...." అచ్చితంగా అన్నాడు.

"ఆ విషయం మరి నువ్వు ఎక్కకముందే ఎందుకు చెప్పలేదూ?" నాకూ కోపం వచ్చింది.

"మీరు సంగీత్ థియేటర్ దగ్గరకి అన్నారుగాని, లోపలికి అని చెప్పలేదుగా...."

"థియేటర్ దగ్గరికి అని చెప్పానుగాని థియేటర్ అని చెప్ప లేదుగా...."

"ఏమిటండీ ఈ సందులు గొందులలోకి తీసుకొచ్చి...." అతను గొంతు పెంచాడు.

అప్పటికే మా ఇంటి చుట్టుపక్కలున్న ఇళ్ళ కిటికీలన్నీ తలలతో నిండిపోయి వున్నాయి. సిగ్గనిపించింది.

"ఏమండీ.... తొందరగా ఇలా రండి...." ఇంతలో మా ఆవిడ గట్టిగా కేకేసింది.

చటుక్కున కిందకి దిగాను.

అంతే! అంతకన్నా వేగంగా ఆటో ఆతను ఆటోని ముందుకి వురికించేశాడు, చిల్లర ఇవ్వకుండానే!

"నిన్న మనం వెళ్ళేప్పుడు మీరు తాళాన్ని సరిగా వేశారా?" నేనింకా రాకపోయేసరికి తనే మెయిన్‌గేటు దగ్గరకి వచ్చింది మా ఆవిడ.

"ఏం?" ఆమె అలా ఎందుకు అడుగుతోందో అర్థంకాలేదు నాకు.

"తలుపులకి తాళం తగిలించి వుందండీ.... వేసిలేదు...."

నెత్తిన పిడుగుపడ్డట్టు వులిక్కిపడ్డాను. ఆమె వెంటే పరుగెత్తాను. తాళం గొళ్ళేనికి తగిలించివుంది.

నిన్న తాళం వేసిన తర్వాత నేను రెండు మూడుసార్లు గట్టిగా లాగి కూడా చూశాను. మరిదేమిటి?

చటుక్కున ఆ తాళాన్ని ఇవతలికి లాగి తలుపుల్ని తెరిచాను.

ఎదురుగా గుండెల్ని పగలగొట్టే దృశ్యం!

ఇంటినిండా సామాన్లు చిందరవందరగా పడివున్నాయి. హాల్లో వున్న టేబుల్ సొరుగులు మధ్యలో కిందపారేసి వున్నాయి. చుట్టూ పుస్తకాలూ, బట్టలూ చిందర వందరగా వున్నాయి!

ఒక్క పుదుటున బెడ్‌రూమ్‌లోకి పరుగెత్తాను. బీరువా తలుపులు కూడా బార్లా తీసున్నాయి. లోపలి లాకర్ కూడా తెరచివుంది!

అయిపోయింది! అంతా అయిపోయింది!! అక్కడే కూలబడి పోయాను. మా ఆవిడైతే ఏడుపు మొదలు పెట్టేసింది, గుండెలు పగిలిపోయి!

సెకండ్లలో చుట్టుపక్కలవాళ్ళతో మా ఇల్లు నిండిపోయింది.

అందరూ 'ఏం జరిగింది?' అంటే 'ఏం జరిగింది?' అనే ప్రశ్నల వర్షం కురిపించడం ప్రారంభించారు.

అంత బాధలో అందరికీ ఆ విషయాన్ని వివరించడం కష్టమైనా తప్పలేదు.

"అంటే - రాత్రో, తెల్లవారు ఝామునో ఈ దొంగతనం జరిగి వుంటుందన్నమాట!" తేల్చేశారు రిటైర్డ్ టీచర్ రామనాథం.

"చుట్టూ ఇన్ని ఇళ్ళు వుండగా ఇలా దొంగతనం చెయ్యడానికి వాళ్ళకెంత ధైర్యం?!" మరింత ఆశ్చర్యపోయారు సుబ్బారావుగారు.

"మీకు రాత్రిగాని తెల్లవారు ఝామునగాని శబ్దాలేవీ వినిపించ లేదాండీ?" మా పక్కింటి పరమేశ్వరరావుని అడిగాను.

"అబ్బే లేదండీ...." అన్నాడు.

అదే జవాబిచ్చాడు రెండోవైపు ఇంట్లోవున్న ప్రకాశరావు కూడా.

అందరూ ఇంతవరకూ మేము గమనించలేదంటే, మేము గమ నించలేదు అన్నారు.

నాకు వళ్ళు మండిపోయింది. తమ పక్కిల్లు తాళం పగలగొట్టి దొంగలు దోచుకుపోయినా వీళ్ళెవ్వరికీ తెలియలేదు! ఇది ఊరా? ఎడారా?

మరి, ఇందాక ఆటోవాడి అరుపులకి క్షణాల్లో అలా చుట్టుముట్టేశారే!

ఈ మాటల్ని బయటికి అంటే సొమ్ము పోయి కసి చుట్టుకున్నట్టవుతుంది. అందుకే ఈ బాధనంతా లోపలే దిగమింగుకున్నాను.

"అయ్యో.... బీరువాలో పెట్టిన వెండి సామానంతా పోయిందండీ...." కంగారుగా బీరువాని వెదకబోతున్న మా ఆవిడని వారించాడు పరమేశ్వరరావు.

"అవేవీ మీరు ముట్టుకోకండి.... పోలీసులు వచ్చి వెళ్ళేంత వరకూ ముట్టుకోకుండా వుండే మంచిది" అన్నాడు.

"అవును. వెంటనే మీరువెళ్ళి పోలీస్ రిపోర్ట్ ఇవ్వండి." ప్రకాశరావు అన్నాడు.

"మీరు మాట్లాడకుండా వూరుకున్నారంటే ఈ దొంగ వెధవలకి మరింత చులకన అయిపోతాం. రేపు మనం ఇంట్లో వుండగానే వాళ్ళు దొంగతనం చెయ్యడానికి కూడా వెనకాడరు! వెంటనే రిపోర్టివ్వండి." రంగనాథం గారన్నారు.

ఇంతకుముందు జరిగిన దొంగతనాల గురించి, వాళ్ళని పట్టుకోవడంలో పోలీసుల పాత్రల గురించి కథలు కథలుగా ఒకొక్కళ్ళు చెప్పడం ప్రారంభించారు.

"ఈ కథలన్నింటినీ తర్వాత వినొచ్చు, మీరు ముందు వెళ్ళి పోలీస్ రిపోర్ట్ ఇచ్చిరండి...." కన్నీళ్ళు తుడుచుకుంటూ గర్జించింది మా ఆవిడ.

పరమేశ్వరరావును తోడు తీసుకుని పోలీస్ స్టేషన్‌కి బయల్దేరాను.

మార్గాయాసం రాకుండా అతను దారిలో పోలీస్ లీలల గురించి కాల కథలు చెప్పాడు పోయిన సొమ్ముకన్నా ఎక్కువ పోయినట్లు

రిపోర్టు చేస్తే కనీసం దాంట్లో సగమైనా మనం తిరిగి పొందగలమని బోధించాడు. నాకూ నిజమేననిపించింది.

పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ ఇచ్చాను - పరమేశ్వరరావు చెప్పినట్లే.

పోలీసులు వచ్చారు.

ఇల్లంతా దొంగరాల్లా తిరిగారు - పీటమీద వేలిముద్రలున్నా యంటే, పీటమీద వేలిముద్ర లున్నాయని! అతిరికి వేలిముద్రాలున్నాయని ఓ అద్దం, క్యాష్‌బాక్స్ పట్టుకెళ్ళారు!!

ఇది జరిగిన ఓ పది రోజులకనుకుంటాను- ఇన్‌స్పెక్టర్ దగ్గరనుంచి పిలుపొస్తే వెళ్ళాను.

ఈలవేస్తూ అద్దంలో చూసి తల దువ్వుకుంటున్నవాడల్లా- అద్దంలో నా బింబం కనిపించగానే ఈలాపి చటుక్కున వెనక్కి తిరిగి "పోయిన వాటికన్నా ఎక్కువ విలువైన వస్తువులు పోయినట్లు తప్పుడు రిపోర్ట్ ఎందుకిచ్చావ్? ఇలా తప్పుడు రిపోర్టులిస్తే, ఇన్వెస్టిగేషన్ ఎలా ముందుకు సాగుతుంది? నీ వస్తువుల్ని కనుక్కోలేం. కేస్ క్లోజ్ చేస్తున్నాం" అన్నాడు కోపంగా.

కనీసం నా అద్దం, కేష్‌బాక్సన్నా వెనక్కి ఇప్పించమని అడుగు దామనుకున్నా. కానీ భయం వేసి అడగలేక వెనక్కి తిరిగాను - దొంగలు దొంగదాటుగా నా వస్తువు లెత్తుకుపోతే, వీళ్ళు దొరతనంగా కాజేశారని మనసులోనే తిట్టుకుంటూ!

ఇంటికి వచ్చిన తర్వాత అనిపించింది - నేను ఎక్కువపోయినట్లు రిపోర్ట్ ఇచ్చానని ఇన్‌స్పెక్టర్ ఎలా పసిగట్టగలిగాడు? అంటే .... ఏమి పోయాయో తెలిసిందంటే దొంగ దొరికినట్లేగా!

దొంగ దొరికినా నోరు విప్పలేని నా అసమర్థతకి నా మనసులోనే శాపనార్థాలు పెట్టుకోవడంకన్నా ఇంకేమి చేయ్యగల్ను?! *

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 9-8-84)